# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 20-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- త్వరలో విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.
- సింహాచలంలో స్వామి వారి వార్షిక చందనోత్సవం అంగరంగవైభవంగా నిర్వహిస్తున్నారు.
- మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు.
- రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పెంచేందుకు నైపుణ్య శిక్షణ వికాస ప్రణాళికను ప్రభుత్వం రూపొందించిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

====================

రాష్ట్రంలో త్వరలో విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో 150 కోట్ల రూపాయలతో విద్యుత్ భూగర్భ కేబుళ్ల వ్యవస్థ ఏర్పాటు పనులను మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం ట్రూఅప్ ఛార్జీలు పెంచడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రూడౌన్ చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాసు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పాల్గొన్నారు.

====================

విశాఖ జిల్లాలోని సుప్రసిద్ధ పుణ్య క్షేత్రం సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి వార్షిక చందనోత్సవాన్ని ఈరోజు అంగరంగవైభవంగా నిర్వహించారు. ఏడాదికి ఒక్కసారి మాత్రమే లభించే స్వామి వారి నిజరూప దర్శనం కోసం తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో సింహాచలం తరలివచ్చారు. ఈరోజు తెల్లవారుజామున ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, ఆయన కుటుంబ సభ్యులు స్వామివారిని తొలి దర్శనం చేసుకున్నారు. అనంతరం, రాష్ట్ర ప్రభుత్వం తరఫున హోంమంత్రి వంగలపూడి అనిత స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితర ప్రముఖులు, ఉన్నతాధికారులు స్వామివారిని దర్శించుకున్నారు. ఇదిలా ఉండగా భక్తుల రద్దీ విపరీతంగా ఉండటంతో వారిని నియంత్రించేందుకు హోంమంత్రి అనిత స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా హోంమంత్రి విలేకరులతో మాట్లాడుతూ...

(వాయిస్...30 సెకన్లు)

====================

రాష్ట్రంలో 2035 నాటికి 95 శాతం ప్రజలకు డిజిటల్ అక్షరాస్యతను కల్పించడం, లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తోందని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత నైపుణ్య వికాస ప్రణాళికను రూపొందించిందని ఈ రోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోగ్యకర సమాజ నిర్మాణంతో పాటు ప్రజల ఆర్థిక సుస్థిరత కోసం అందరికీ నైపుణ్యాభివృద్ధి ఆవశ్యకతను గుర్తించి, ఆ మేరకు కార్యక్రమాల్ని చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. విస్తృత నైపుణ్య వికాస ప్రణాళికలో భాగంగా 75 శాతం ప్రజలకు గుర్తించిన

మేరకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం, శిక్షణ పొందినవారిలో 80 శాతానికి పైగా ఉద్యోగావకాశాలు కల్పించడం, శిశు సంరక్షణ మరియు వృద్ధులకు అవసరమైన సేవలందించేందుకు లక్ష మందికి సర్టిఫికెట్ కోర్సుల్ని అందించడం, శ్రామిక శక్తి భాగస్వామ్యంలో మహిళల వాటాను 25 శాతం పెంచడం వంటి లక్ష్యాల్ని నిర్ధారించినట్లు మంత్రి వెల్లడించారు. ఈ దిశగా సాగే ప్రయత్నాల్లో భాగంగా లభించే అవకాశాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పుట్టినరోజు సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీతో పాటు పలువురు ప్రముఖులు ఆయనకు ఈరోజు శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తోందని నరేంద్రమోడీ ఈ సందర్భంగా ప్రశంసించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ద్వారా ఆయన పోస్ట్ చేస్తూ రాష్ట్రం కోసం నిరంతరం శ్రమించే ముఖ్యమంత్రి అని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు పలువురు కేంద్ర మంత్రులు చంద్రబాబు నాయుడుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలా ఉండగా జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 269 అన్న క్యాంటీన్లలో చంద్రబాబు నాయుడు దంపతులు ఉచితంగా భోజనాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి అవసరమైన 76 లక్షల రూపాయల విరాళాన్ని ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి వ్యక్తిగతంగా అందించారు. అదే విధంగా విజయవాడలోని పటమటలో ఉన్న అన్న క్యాంటీన్‌లో ముఖ్యమంత్రి దంపతులు అల్పాహారం స్వీకరించారు.

====================

విరామం

====================

గంజాయి ఇతర మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. పార్వతీపురం మన్యం జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా 100 రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని సాలూరు పట్టణంలో మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు నినాదాలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ యువత భవిష్యత్తును, దేశ అభివృద్ధిని ప్రభావితం చేసే చెడు వ్యసనాలకు అందరూ దూరంగా ఉండాలని పిలుపు ఇచ్చారు. మత్తు పదార్థాల విక్రయం, రవాణా, నిల్వ, వినియోగం వంటి అక్రమ కార్యకలాపాల్లో పాల్గొని జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. ప్రజల సహకారంతో పార్వతీపురం మన్యం జిల్లాను మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చూస్తామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

====================

గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు, పందులను పెంచే పశువుల కాపరులకు చేయూతను ఇచ్చేందుకు పశుకిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ సంచాలకులు డా. టి. దామోదర్ నాయుడు ఈరోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. విబిజి రామ్ జి పథకం నిధులను వినియోగించి జిల్లాకు ఐదేసి చొప్పున నియోజకవర్గాల కేంద్రాలకు సమీపంలో పశువసతి గృహాలను నిర్మించనున్నట్లు అయన చెప్పారు. పశుకిసాన్ క్రెడిట్ కార్డు పొందడానికి రాష్ట్రంలోని స్వంత భూమి, కౌలు భూమి కలిగిన పశుపోషకులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు అర్హులని స్పష్టం చేశారు. పశువుల సంఖ్యను బట్టి ఎలాంటి పూచీకత్తు లేకుండా గరిష్టంగా 3 లక్షల వరకూ రుణసదుపాయం బ్యాంకు నియమ నిబంధనలు అనుసరించి పశుపోషకులు పొందవచ్చునని అయన చెప్పారు. ఇదిలా ఉండగా, పశువసతి గృహాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని రెవెన్యూ శాఖ ద్వారా కేటాయిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిర్ణీత లక్ష్యం మేరకు 2027 మార్చి 31వ తేదీ నాటికి పశువసతి గృహాల నిర్మాణాలు పూర్తి చేయాల్సిందిగా సంబంధిత శాఖాధికారులకు ఆదేశాలు ఇచ్చామని అయన వెల్లడించారు.

====================

పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థిని ప్రణీత జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా పేరును జాతీయ స్థాయిలో మారుమ్రోగేలా చేసింది. పదవ తరగతి చదువుతున్న ఈ క్రీడాకారిణి అండర్-17 విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి ఫైనల్స్ వరకు చేరుకోవడం విశేషం. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి కలెక్టర్ కార్యాలయ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రణీతను ప్రత్యేకంగా అభినందించారు. ఆమెకు శాలువా కప్పి ప్రశంసా పత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రణీత చిన్న వయసులోనే జాతీయ స్థాయి పోటీల్లో ఫైనల్స్ వరకు చేరుకోవడం జిల్లాకే గర్వకారణమని, ఆమె పట్టుదల మరెందరో విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

====================

దేశంలోని ప్రతిపక్షాల తీరు కారణంగా మహిళలు, ఎస్సీ ఎస్టీ వర్గాలకు తీవ్ర నష్టం కలుగుతోందని ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ ఛైర్మెన్ లంకా దినకర్ అన్నారు. అమరావతిలోని సచివాలయంలో ఆయన పాత్రికేయులతో ఈరోజు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విధంగా ప్రతి రాష్ట్రానికి 50 శాతం అదనపు సీట్లు పెంపుదల వల్ల న్యాయం జరుగుతుందని చెప్పారు. అటువంటి బిల్లును ఆపడం ద్వారా మహిళల సాధికారితకు విఘాతం కలిగిందని అన్నారు.

====================

తెలంగాణ నుండి రాయలసీమ అంతర తమిళనాడు మీదుగా కొమరిన్ ప్రాంతం వరకు ఒక ద్రోణి సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి కొనసాగుతుందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ వివరాలను వాతావరణ అధికారి నారాయణ తెలియచేస్తూ..

(వాయిస్...28 సెకన్లు)

====================

====================